# నీరు నిలవదు



ఉదయం తొమ్మిది గంటల వేళ.

కృష్ణరేవులోకి ఆడవాళ్ళు ఒక్కొక్కరే చేరుకుంటున్నారు. పిల్లలికి చద్దన్నాలు పెట్టి బళ్ళోకి పంపి, మొగవాళ్ళు ఎవరి పనులమీద వాళ్ళు పొలాలకి, వీధిలోకి వెళ్ళగా ఇల్లాళ్లు ఇళ్ళు కడుక్కుని పొయ్యిలు అలుక్కుని, బిందెలనిండా ఉతకవలసిన బట్టలు నింపుకుని, రేవులో కొస్తున్నారు.

ఓ పక్క మల్లయ్య రేవులో పడవ బయలుదేరబోతోంది. ఆంజనేయస్వామి

రేవులో మొగవాళ్ళు ఇంకా కావిళ్ళు ముంచుతూ వున్నారు. చింతలచెట్టు రేవులో పిల్లలు కోసురాయి మీంచి నీళ్ళలో దూకుతూ మునకలేస్తున్నారు. అల్లాంటి సమయాన అమరావతిలోని అన్ని వర్గాల ఆడంగులూ రేవులో కొస్తున్నారు. బిందెలు నడుంమీద పెట్టుకుని, అవి జారిపోతుంటే ఇవతలి నడుంమీదికి మార్చుకుంటూ, గలగల నవ్వుకుంటూ నడుస్తున్నారు. కృష్ణకి వెళ్ళే దోవంతా కాలిమట్టెల మోతలు. పాతకాలపు సింగారమ్మ నడుస్తుంటే కాలి కడియాలు టంగు టంగున మోగుతున్నాయి. కొత్తగా కాపరానికొచ్చిన వయస్సు పిల్లలు ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ వెళ్తుంటే వాళ్ళ కాలిగజ్జెల పట్టీలు ఘల్లుఘల్లుమంటున్నాయి. వొకళ్ళ వెనకాల వొకళ్ళు అందరూ రేవులోకొచ్చారు. కృష్ణవొడ్డున వారగా ఆడవాళ్ళబారులు. ఈ చివర్నించి ఆ చివరికి రంగు రంగుల స్త్రీలు. కృష్ణమ్మ నల్లటి చీరకు పువ్వుల పువ్వుల అంచులా వొడ్డునిండా ఆడవాళ్ళ వరస.

రేవులో కొస్తూనే పలకరింపులు, వేళాకోళాలు, చర్చలు.

"బుల్లెమ్మగారింట్లో అప్పడాలొత్తినట్టున్నారే" రంగమ్మ బట్టలు తడుపుతూ పుల్లమ్మ నడిగింది.

"ఆ ఒత్తారు కాని పిండిలో కారం చాల్లా" అంది పుల్లమ్మ.

"నీ కెట్టా తెలుసు? నువ్వూ వెళ్ళావా వొత్తటానికి?" నిలదీసింది రంగమ్మ.

రంగమ్మకి, బుల్లెమ్మకి పడదు.

"అబ్బే! నన్ను పిలిస్తేనా? మా పిల్లాడు అటెళ్తే వాడి చేతిలో ఇంత అప్పడాల పిండి పెట్టారులా వుంది. వాడి చేతిలోది కొంచెం నా చేతిలోకి తీసుకుని నాలిక్కి రాసుకున్నా" సర్దిచెప్పింది పుల్లమ్మ.

మరికొంచెం పైగా పెళ్ళిళ్ల మీద కబుర్లు సాగుతున్నాయి. "సుబ్బయ్యగారి కొడుకు పెళ్ళిలో నెయ్యి బదులు డాల్డా వడ్డించారుటగా?" అంది పోలమ్మ, "సరేలే! అదైనా వడ్డించారు కరువు కాలంలో ..... ఇది విన్నావా? రంగమ్మకి ఏం

పొయ్యేకాలం! కోడలు నిన్నగాక మొన్న కాపరాని కొచ్చింది గాదా! చిన్నపిల్ల. దానిచేత కవ్వం కట్టించి మజ్జిగ చేయమంటుంది?" అని మాట మార్చింది చిట్టెమ్మ.

"సరేలే! నీకు ఇప్పుడు తెలిసిందా రంగమ్మ సంగతి! అది మావకి మంచి నీళ్ళిచ్చిందా? అత్తకు అన్నం పెట్టిందా? అయినవాళ్ళనీ కానివాళ్ళనీ విరుచుకు తింటమే దానిపని" అంటూ పోలమ్మ పడాపడా చీర ఉతుకుతోంది.

ఇంకా కొంచెం పైగా సూరమ్మ అంటోంది. "రాత్రి సీతారత్తాన్ని మొగుడు కొట్టాట్టగా?"

"సర్లే! కొట్టకపోతే చెప్పుకోవాలి గాని, కొట్టే చెప్పుకోవటం ఎందుకూ? రోజూ వున్న పాటేగా" అంది పేరమ్మ.
"మరయితే రోజూ ఎందుకు కొడ్తాడే?"

"నిజం ఆ దేవుడికే తెలియాలి. సీతారత్తానికిన్నీ ఆ పాలేరుకిన్నీ......"
"అమ్మ నంగనాచో ...."

సగం చీర కట్టుకుని మిగతా చీర ఉతుకుతున్న సరోజ పక్కనున్న గిరిజతో 'ఒసేవ్!-ఆ బుగ్గన గాటేవిటే' అంటూ ఉతకటం ఆపి ముక్కున వేలేసుకుంది. గిరిజ సమాధానం చెప్పకుండా పిండిన చీరతో సరోజని ఒక్క బాదు బాదింది. గలగల నవ్వుతూ మళ్ళీ ఉతుకులు.

ఒకచోట పట్టుచీరల ధరల మీద! ఇంకొకచోట ఆవకాయ పాళాలు! మరో చోట ఇత్తడి గిన్నెల మార్పిళ్ళు! ఇలా మాటలు సాగుతుంటే మహాలక్ష్మి శ్రీదేవితో అంది "రాజమ్మ కూతురు పెద్దమనిషైందిట. తెలుసా" అని.

శ్రీదేవి కళ్ళింతవి చేసుకుని 'ఇహ కార్యం లగ్నమే ఆలస్యం' అంటూ పక్కనున్న ఆవిడకి చెప్పింది 'రాజమ్మ కూతురు పెద్దమనిసైంది. కార్యం లగ్నం పెట్టారు' అని.

ఆవిడ ఇంకో ఆవిడతో, ఆవిడ మరో ఆవిడతో ఇలా సర్‌సర్‌ని వార్త పాకిపోతోంది.

"రాజమ్మ కూతురు పెద్దమనిషైంది. కార్యం"

"రాజమ్మ కూతురికి కార్యమైంది."

"రాజమ్మ కూతురు కార్యమైపోయింది."

"రాజమ్మ కూతురికి కడుపైంది."

"అమ్మ సోద్యం! రాజమ్మ కూతురికి కడుపైంది"

"కార్యం కాకుండానే రాజమ్మ కూతురికి కడుపైంది."

"అల్లుడింట్లోనే ఉన్నాడు.. కడుపైంది. తప్పా!"

ఇలా వొడ్డుచివర కెళ్ళేప్పటికి వార్త మారిపోయింది. కొంతసేపటికి ఆ చివరకే రాజమ్మ బిందె తీసుకొచ్చింది. ఆడవాళ్ళు మొహాలు మొహాలు చూసుకొని రాజమ్మ మొహం చూశారు. ఏం తెలియని రాజమ్మ అమాయకంగా చెప్పింది. "పిల్లపెద్దదైంది. సాయంత్రం. పేరంటం. పిలవడానికొస్తాను."

"అంతేనా .... " అని తమాయించుకొని రాజమ్మ పిల్ల పెద్దదైంది అంతే, అన్న వార్త ఆ చివర్నించి ఈ చివరకి తిరిగి ప్రసారం చేశారు.

బట్టలుతకటం అయిపోయాక ఓ చేత్తో బిందె పుచ్చుకుని గొంతులోతు నీళ్ళలో స్నానాలు. బిందె నీళ్ళలో తేల్తుంటే వాలుకు కొట్టుకుపోకుండా పట్టుకుంటూ నాలుగు మునకలేసి సూర్యుడికి మొక్కి బిందెనిండా నీళ్ళు ముంచుకుని ఉతికిన బట్టలను భుజాలమీద వేసుకొని ఒక్కొక్కరే ఇంటి ముఖం పడ్తున్నారు.

పది గంటలకల్లా రేవు ఖాళీ అయిపోయింది. అంతా నిశ్శబ్దం. మురికి బట్టలు ఉతికినట్లుగానే, నిన్న ఊళ్ళో జరిగిన మంచీ చెడూ, చిన్న విషయం, పెద్ద విషయం సర్వమూ కిష్టవొడ్డున ఉతికేసి గిలక్కొట్టి వెళ్ళిపోయారు ఆడంగులు.

క్రిష్ణమ్మ ఆ కబుర్లన్నీ వింది. ఆ నీళ్ళు ముందుకు వెళ్ళిపోతున్నాయి. రేపు కొత్త నీళ్ళొస్తాయి. మళ్ళీ అవి కథలు విని వెళ్ళిపోతాయి. ఏ కబురూ, ఏ కథా నిలవ వుండదు. రుచే మిగులుతుంది. *